మినీకథ

# మానవుడు మైనస్ దానవుడు

రాంపల్లి వసుంధర



అతని పేరు బాబులు! కోరమీసం, బుగ్గమీద కత్తిగాటు, చింతనిప్పుల్లాంటి ఎర్రటి కళ్ళు... సినిమాల్లో విలన్ అనుచరుడిలా అతని క్రూరత్వాన్ని చెప్పక చెప్పతున్నాయి. అతనితో మాట్లాడ్డం ఎవరికీ ఇష్టం వుండదు. ముఖ్యంగా ఆడవాళ్ళకి! వయసులో వున్న అమ్మాయిల కయితే మరీను!

కాని తప్పదు! ఆ లొకాలిటీలో ఎవరికీ అతనితో మాట్లాడకుండా గడవదు. అది వారి అవసరం! కారణం, బాబులు రేషన్‌షాపు ఓనరు!

నాలుగేళ్ళు కాపురం చేశాక ఇక చెయ్యలేనని అతని భార్య అతన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఆ తర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు బాబులు!

గవర్నమెంటు రూల్సు ప్రకారం షాపు తెరుస్తాడు! బ్లాక్ చెయ్యకుండా వచ్చిన సరుకు వచ్చినట్టు ఇచ్చేస్తాడు.

పగటిపూట తనకు చేతనయినట్టు వండుకు తింటాడు. రాత్రివేళ వీధి చివరనున్న హోటల్‌నుంచి ఏదయినా తెప్పుకుని తింటాడు. అంతవరకు మంచి వాడే!

ఆ తర్వాతే... మరో అవతారం ఎత్తుతాడు.

రాత్రి షాపు మూసివేశాక కల్లుపాకకి చేరుకుంటాడు. కడుపు నిండేదాకా, మనసు తృప్తి చెందేదాకా పట్టిస్తాడు. ఆ పైన... వేటకి బయలుదేరతాడు.

పులివేటకి కాదు. 'పిల్ల' వేటకి!

లొంగిందా సరేసరి! లేకపోతే లొంగదీసుకుంటాడు, చాలా తేలిగ్గా!

అతని ప్రవృత్తి ఎరిగిన ఆ లొకాలిటీ వాసులు అతన్ని అక్కడ్నుంచి తరిమి వెయ్యడానికి చెయ్యని ప్రయత్నాలు లేవు. అయితే ఆ ప్రయత్నాలేమీ ఫలించలేదు. ఎందుకనో పోలీసులు కూడా అతన్ని ఏమీ చెయ్యలేకపోయారు. తప్పనిసరి పరిస్థితిలో అసహనంగాను, అనుమానంగాను మనుగడ సాగిస్తున్నారు ఆ ప్రాంతీయులు.

* * *

విద్యుచ్ఛక్తి కొరత కారణంగా, పవర్ కట్‌వల్ల వీధి దీపాలు లేని ఆ సన్నటి వీథిలోంచి రాత్రి పదిగంటల సమయంలో నెమ్మదిగా నడుస్తూ వెళ్తోంది ఒక యువతి!

అప్పుడే కల్లుపాకలోంచి బయటపడ్డ బాబులు దృష్టిలో పడింది ఆమె.

వెనకాలే నడుస్తూ కొంత దూరం ఫాలో అవడం, వెకిలి మాటలనడం లాంటి పనులు చెయ్యడు బాబులు! గబగబా నాలుగు అడుగుల్లో దగ్గరికి చేరాడు. అటు ఇటు ఒక్క చూపు విసిరి, ఒక చేత్తో నోరు మూసేస్తూ, మరో చేత్తో భుజం మీద వేసుకున్నాడు. జరిగిందేమిటో అర్థం కాక ఈ హఠాత్ సంఘటనకి మరుక్షణమే మూర్ఛపోయింది ఆ యువతి!

సినిమాలో విలన్ స్థావరంలా, ఇలాంటి పనులకి... ఇళ్ళకి కాస్త దూరంగా వున్న ఖాళీ ప్రదేశంలో ఒక గుడిసె వుంది బాబులుకి. "మాద్దానికి నాజూగ్గా వున్నావు కానీ ఎంత బరువున్నావే..." అంటూ నేల మీదకి వదిలేసాడు బాబులు ఆ యువతిని.



ఇంకా స్పృహ రాని ఆమె అలానే పడివుంది.

సాధారణంగా ఆ సమయంలో భయంతో 'కెవ్వు' మనే కేకనో, కోపంతోను, అసహ్యంతోను తిట్టే తిట్లనో, నిస్సహాయంగా ఏడ్చే ఏడుపునో వినే అలవాటున్న బాబులు రెండు క్షణాలు ఎదురుచూసి, చలనం లేకుండా పడివున్న ఆ యువతిని ఆశ్చర్యంగా పరికించి చూశాడు ఒక్కక్షణం.

అంత మత్తులోను ఒక విషయం అర్థం అయింది బాబులుకి!

ఇంతవరకు తను పట్టితెచ్చిన వాళ్ళకి, ఆమెకి ఏదో తేడా వుంది. ఈమె అందరిలా లేదు. ఆ తేడా ఏమిటో... ఎక్కడో అంతుపట్టలేదు అతనికి.

భారంగా ఊపిరి పీల్చి విడుస్తోంది ఆమె!

'తెలివి తప్పింది కాబోలు' అనుకున్నాడు బాబులు!

'తెలివి వచ్చేదాకా ఎదురుచూడాలా? లేక...' అని అతను ఆలోచించుకుంటూ వుండగానే —

ఆమె కదిలింది. కదులుతూనే బాధగా మూలిగింది. క్రమేపీ ఆమె మూలుగు అరుపులుగా మారింది.

ఆ అరుపులు బాబులుని చూసి కాదు. ఆమె అసలు బాబుల్ని చూడనేలేదు.

అరుస్తూ, కేకలు పెడ్తూ బాధగా అటు ఇటు దొర్లుతోంది. తనకే అర్థం కాని స్థితిలో ఒంటిమీద చీర లాగేసుకుంటూ కడుపు పట్టుకుని విలవిలలాడుతోంది.

బీడీ ముట్టించడం కోసం అగ్గిపుల్ల వెలిగించాడు బాబులు! ఆ వెలుగులో... అప్పుడు గమనించాడు, ఆమె కడుపు ఎత్తుగా, చాలా ఎత్తుగా వుండడం.

కాస్త నిషా తగ్గింది బాబులుకి.

గర్భంలో వున్న ప్రాణి బయటపడడానికి చేస్తోన్న విశ్వ ప్రయత్నం కారణంగా ఆమె మరణయాతన పడుతోంది. అదే 'ప్రసవ వేదన' అంటే!

బాబులు చూస్తూ వుండగానే ఆమె కేకలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆమెని అలా వదిలేసి వెళ్ళిపోవాలనిపించలేదు అతనికి. ఏం చెయ్యాలో తెలియడం లేదు. ఆమెకి ఏ విధంగా సహాయపడాలో అర్థంకాక అయోమయంగా చూస్తూ ఆమె ప్రక్కనే మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

గొంతు చీల్చుకుని గుండెలోంచి వచ్చిన అరుపుతో ఆమె మళ్ళీ చలనం కోల్పోయింది. స్పృహ తప్పినట్టు తల ఓ పక్కకి వాల్చేసింది. ఆమె నుంచి శబ్దం రాకపోవడంతో ఖంగారుపడుతూ ఆత్రుతగా అగ్గిపుల్ల వెలిగించి చూశాడు బాబులు!

ఇపుడు ఎత్తుగా వున్న కడుపు కనబడడం లేదు అతనికి. ఆమె కాళ్ళ మధ్య చిన్న కదలిక. అక్కడంతా ఎర్రగా తడిసిన బట్టలు... ఆ వెలుతురులో గమనించి నిర్ఘాంతపోయాడు బాబులు!

ఆడదాన్ని ఆ పరిస్థితిలో ఎన్నడూ చూడలేదు బాబులు!

ఆడదాని మరో రూపాన్ని... అసలు రూపాన్ని చూస్తున్నాడు.

ఆడది ఒక ప్రాణికి జన్మ ఇవ్వడాన్ని స్వయంగా చూస్తున్నాడు. తాగిన మత్తు పూర్తిగా దిగిపోయింది బాబులుకి.

జరిగింది అర్థం అయింది. ఆడదంటే ఏమిటో అర్థం అయింది.

ఒక్క పరుగులో వెళ్ళి తనింటి పక్కనుండే ముసలమ్మని తీసుకువచ్చాడు. ఆ అర్ధరాత్రి ఒక ముసలమ్మ సహాయంతో బాబులు ఒక 'స్త్రీ'కి ఇంచుమించు పురుడు పోశాడనే విషయం మూడో కంటికి తెలియదు.

* * *

బాబులు చూస్తాడు ఆడవాళ్ళకేసి... కాదు ఆడవాళ్ళలోకి! కోరికతో కాదు. గౌరవంతో... భక్తితో... అభిమానంతో.

ఇపుడు బాబులు కల్లు పాకకి వెళ్ళడు, వేటకీ వెళ్ళడు. ఖాళీ దొరికినప్పుడల్లా చిన్న చిన్న పిల్లలతోను, చంటి పాపలతోను ఆడుకుంటూ వుంటాడు ఎంతో ఆనందంగా, తృప్తిగా!